క్లుప్తంగా

శ్రీగోవిందరాజస్వామి పుష్పయాగం రేపు

–నేడు పుష్పయాగానికి అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో శుక్రవారం పుష్పయాగ మహోత్సవం వేడుకగా నిర్వహించనున్నారు. ఈ మేరకు స్వామివారి పుష్పయాగానికి గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు స్వామివారికి పుష్పయాగం మహోత్సవం జరుగనుంది.

ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్ల గుర్రపు స్వారీ



గుర్రపు స్వారీ చేస్తున్న ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్లు

తిరుపతి సిటీ: తిరుపతి 2ఏ ఆర్మీ రెజిమెంట్‌కు చెందిన ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్ల హ్యాక్ రైడ్–2024 పేరుతో బుధవారం తిరుపతి సమీపంలోని అటవీ ప్రాంతంలో హార్స్‌రైడ్‌ను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్‌సీసీ పూర్వ విద్యార్థుల ఔట్‌రీచ్‌లో భాగంగా 15మంది ఎన్‌సీసీ పూర్వ క్యాడెట్లు పాల్గొన్నామన్నారు. తాము ఏ స్థాయిలో ఉన్నా ఎన్‌సీసీ తమకు అందించిన దేశభక్తి, విలువలతో కూడిన క్రమశిక్షణ మరువలేమన్నారు. ఫారెస్టులో క్రాస్ కంట్రీ జాయ్ రైడ్ చేసేందుకు అధికారుల అనుమతి తీసుకుని నిర్వహించామన్నారు. ఎన్‌సీసీ తిరుపతి విభాగం పూర్వవిద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు చెవిరెడ్డి



సర్పంచ్ సింహాల విమలమోహన్

భాకరాపేట: చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధికి మారుపేరు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని జంగావాండ్లపల్లె సర్పంచ్ సింహాల విమల మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నగొట్టిగల్లు జగనన్న సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకారోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన అక్క చెల్లెమ్మలు సంతోషంగా చెవిరెడ్డి చేసిన అభివృద్ధి గురించి చెప్పుకున్నారని తెలిపారు. చెవిరెడ్డి కుటుంబం నిత్యం అభివృద్ధి, ప్రజల గురించి పరితపించిందని పేర్కొన్నారు. అభివృద్ధిపై విమర్శలు మాని, మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని విమర్శలు చేసేవారికి ఆమె చురకలు అంటించారు. అభివృద్ధి చేయడానికి ఎవ్వరు ముందుకు వచ్చినా వారికి మా సహకారం అన్ని విధాలుగా ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం వెలుపల ఐశ్వర్య రాజేష్, కుటుంబసభ్యులు, సీనియర్ నటి లక్ష్మి

తిరుమల: తిరుమల శ్రీవారిని బుధవారం సినీ నటి ఐశ్వర్య రాజేష్, సీనియర్ నటి శ్రీలక్ష్మి, తెలంగాణ ఎమ్మెల్యే మురళీనాయక్, డీజీజీ షిముషి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మృతి చెందిన వృద్ధుడి ఆచూకీ లభ్యం

చంద్రగిరి: గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందడంపై సోమవారం దినపత్రికల్లో వచ్చిన వార్తా కథనంలో మృతుడి ఆచూకీ లభ్యమైనట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు. చంద్రగిరి జాతీయ రహదారి ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో వృద్ధుడు మృతిచెందడంపై దినపత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దినపత్రికల్లో వచ్చిన వార్తను చూసిన కుటుంబ సభ్యులు బుధవారం చంద్రగిరి పోలీసులను సంప్రదించారు. మృతిచెందిన వ్యక్తి దొరస్వామి(70), పి.ఎర్రేపల్లి గ్రామం ఐరాల మండలమని మృతుడి కుమారుడు గురునాథం పోలీసులకు వివరించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, మృతుడి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

గంగమ్మతల్లికి టీడీపీ మొక్కులు

తిరుపతి (అలిపిరి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం ఆ పార్టీ నేతలు తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మబ్బు దేవనారాయణరెడ్డి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, సురేంద్రనాయుడు, హేమంత్‌కుమార్ యాదవ్, కృష్ణయాదవ్, మహేష్ యాదవ్, సుబ్బుయాదవ్, పాల్గొన్నారు.

చెత్తే బంగారమాయే!

చెత్తే కదా అని నిర్లక్ష్యం చేయలేదు. ఆ చెత్త నుంచే ఆదాయం గడించడంపై దృష్టి సారించింది పాలక యంత్రాంగం. రోజూ వెలువడే వ్యర్థాల ద్వారా సంపద సృష్టిస్తోంది. కిలో పొడి చెత్త రూ.2 చొప్పున విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతోంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ గత ఏడాది డిసెంబర్ నుంచి డ్రైవేస్ట్ ప్లాంట్‌ను తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దశాబ్దాల నుంచి గల యంత్రాంగం చెత్తను నిర్లక్ష్యం చేసింది. తాజా నిర్ణయంతో పొడిచెత్త బంగారంలా అమ్ముడుపోతోంది.



తూకివాకం గ్రీన్ సిటీలో చెత్తను సెగ్రిగేషన్ చేస్తున్న యంత్రాలు

- కిలో చెత్త నుంచి రూ.2 ఆదాయం
- నెలకు రూ.30 లక్షలు.. ఏడాదికి రూ.3.6 కోట్లు
- రూ.8 కోట్ల వ్యయంతో డ్రై వేస్ట్ ప్లాంట్ నిర్వహణ

తిరుపతి తుడా: నగరం జనాభా 4 లక్షలకు పైమాటే. రోజూ 60 నుంచి 80 వేల మంది యాత్రికుల రాకపోకలు సాగిస్తున్నారు. ప్రముఖ యాత్రా స్థలం కావడంతో ఆ స్థాయిలోనే హోటళ్లు, రెస్టారెంట్లు, వ్యాపార కేంద్రాలు వెలిశాయి. ఈ క్రమంలో తిరుపతి నగరంలో ప్రతిరోజూ 197 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో 123 టన్నుల తడిచెత్త (కూరగాయల వ్యర్థాలు, హోటల్ వేస్ట్‌తో కలిపి) కాగా పొడిచెత్త 50 టన్నుల వరకు ఉత్పత్తి అవుతోంది. భవన నిర్మాణ వ్యర్థాలు ప్రతిరోజూ 25 టన్నుల వరకూ ఉంటున్నాయి. ఈ చెత్త నిర్వహణకు రేణిగుంట సమీపంలోని తూకివాకం గ్రీన్‌సిటీలో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. తడిచెత్త నుంచి బయోగ్యాస్, సేంద్రియ ఎరువులు తయారు చేస్తూ ఆదాయాన్ని గడిస్తున్నారు. ఇటీవల భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను ప్రారంభించారు. గత ఏడాది డిసెంబర్‌లో పొడిచెత్త నిర్వహణ ప్లాంట్‌ను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించగా అనతికాలంలోనే ఈ ప్లాంట్ కాసుల వర్షం కురిపిస్తోంది.

చెత్త నిర్వహణలో అగ్రస్థానం

కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన జీవనాన్ని కల్పించేందుకు 2016లో స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించింది. 2017 నుంచి నగరాల మధ్య స్వచ్ఛ పోటీలను నిర్వహిస్తూ వివిధ అంశాల్లో జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులు ప్రకటిస్తూ ప్రోత్సాహకం అందిస్తోంది. స్వచ్ఛతలో టాప్–3లో మెరవగా చెత్త నిర్వహణలో తిరుపతి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. గడిచిన మూడేళ్లుగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో తిరుపతి తన పరపతిని కొనసాగిస్తూ అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ఇక్కడి అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు, పటిష్టమైన నిర్వహణ వ్యవస్థలతో తిరుపతికి జాతీయ స్థాయిలో కీర్తికిరీటాన్ని తెచ్చిపెట్టాయి.

దశాబ్దాలుగా నిర్లక్ష్యం

తిరుపతి మున్సిపాలిటీ 1886లో ఏర్పాటైంది. 2007లో మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. పురపాలక సంఘం ఏర్పాటై 136 ఏళ్లు పూర్తిచేసుకుంది. గడచిన దశాబ్దాల నుంచి తిరుపతిలో ఉత్పత్తి అయ్యే చెత్తను పూడ్చిపెట్టడం, తగులబెట్టడాన్ని నిషేధించింది. ఈ క్రమంలో చెత్త నిర్వహణపై అడుగులు పడ్డాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సరికొత్తగా ఆలోచించి చెత్త నుంచి సంపదను సృష్టించడంపై దృష్టి సారించింది.

కిలో 2 రూపాయలు

తిరుపతి నగరంలో ఉత్పత్తి అయిన చెత్త బంగారంలా అమ్ముడుపోతోంది. ప్రతి రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త నుంచి 50 టన్నుల మేర పొడిచెత్త వేరుచేస్తున్నారు. ఈ చెత్తను వేస్టేడ్ తరలించి సెగ్రిగేషన్ చేస్తున్నారు. ఈ చెత్తను కొనుగోలు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకు రాగా బెంగళూరుకు చెందిన ఎంఎం ట్రేడర్స్ కిలో చెత్తను రూ.2కు కొనేందుకు ముందుకొచ్చింది. రోజూ 50 టన్నుల చెత్తను మున్సిపల్ కార్పొరేషన్ ఆ సంస్థకు విక్రయించి తద్వారా రోజుకు లక్ష రూపాయలు, నెలకు రూ.30లక్షల ఆదాయాన్ని గడిస్తోంది. ఏడాదికి రూ.3.6 కోట్ల ఆదాయాన్ని పొందనుంది. ప్లాంట్ నిర్వహణకు ఖర్చుచేసిన రూ.8 కోట్లను కేవలం రెండు సంవత్సరాల, రెండు నెలల్లోనే ఆర్జించనుంది. ఆపై పూర్తిగా ఆదాయం తెచ్చిపెట్టనుంది. ఈ మేరకు చెత్త నుంచి సంపద సృష్టించి తిరుపతి నగరాభివృద్ధికి బాటలు వేయనుంది.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సమాచారం

తిరుపతిలో ఉత్పత్తయ్యే చెత్త 197 టన్నులు	
తడిచెత్త 123 టన్నులు	పొడిచెత్త 50 టన్నులు
భవన నిర్మాణ వ్యర్థాలు 25 టన్నులు	
పారిశుద్ధ్య కార్మికులు 934	చెత్త సేకరణ ఆటోలు 101
చెత్త తరలించే ట్రాక్టర్లు 13	కాంప్యాక్టర్లు 10

పారిశుధ్యాన్ని పర్యవేక్షించే యంత్రాంగం

కమిషనర్ : అదితిసింగ్	హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్
శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి	
శానిటరీ సెక్రటరీలు 95	శానిటరీ ఇన్‌స్పెక్టర్లు 17
శానిటరీ మేస్త్రీలు 50	

ఆదాయవనరుగా చెత్త

గడిచిన రెండేళ్లుగా పొడిచెత్త నుంచి రోజూ లక్ష ఆదాయం అందుతోంది. చెత్తను పూర్తిస్థాయిలో సెగ్రిగేషన్ చేస్తున్నారు. దేశంలో ఎక్కడాలేని చెత్త నిర్వహణను ఒక్క తిరుపతిలోనే పటిష్టంగా నిర్వహిస్తున్నారు. చెత్తను అనేక పద్ధతుల్లో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ చేస్తూ తద్వారా రోజూ లక్షల్లో ఆదాయం పొందేలా నాడు అధికారులు తీసుకున్న నిర్ణయం నేడు కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరుతోంది. టిప్పర్ల ద్వారా తరలించే ఈ చెత్తను కాటావేసి టన్నులుగా నిర్ధారిస్తున్నారు. కొనుగోలు చేసిన ట్రేడర్స్ అందులోంచి ప్లాస్టిక్, ఐరన్, గాజు, ఫుడ్, టైర్, స్టోన్ వంటి వాటిని వేరుచేసి బయట ప్రాంతాల్లో విక్రయిస్తోంది. కార్పొరేషన్‌కు ప్రతి కిలో చెత్తకు రూ.2 జమ చేస్తోంది. ప్లాంట్ నిర్వహణతో 100 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.



చెత్తను ప్రాసెసింగ్ చేసి తయారుచేసిన ఎరువు

ప్రకృతి పలకరింత మూలకోన

ప్రకృతి రమణీయత ఉట్టిపడే సహజ జలపాతం మూలకోన. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలపాతం కనువిందు చేస్తోంది. ఎత్తైన కొండలు, ఆకాశాన్ని అంటే వృక్షాలు.. ఆ వృక్షాలపై పక్షుల కిలకిలలు.. చల్లటి గాలి.. నేలను తాకని సూర్యరశ్మి.. ఎత్తైన బండరాళ్ల మధ్య నిరంతరం జాలువారే జలపాతం.. సహజ సిద్ధంగా ఏర్పడిన కోనేరు వంటి అందాలు మూలకోన సొంతం. ఇంతటి ప్రకృతి సౌందర్యాల మధ్య శ్రీపార్వతీ సమేత సంగమేశ్వరస్వామి కొలువై ఉన్నారు.

- ఏడాది పొడవునా నిరంతరం జలధార
- కొండపై కొలువైన సంగమేశ్వర స్వామి
- మహాశివరాత్రిన ప్రత్యేక పూజలు
- సెలవు రోజుల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకుల రాక





కోనలో నిరంతర జలధార, కోనలో కొలువైన సంగమేశ్వరస్వామి (ఇన్‌సెట్)

పుత్తూరు: పుత్తూరు పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో మూలకోన (పెద్దతీర్థంకోన) పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఎత్తైన కొండ రాళ్ల మధ్య నిరంతరం జాలువారే నీరు, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కోనేరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఏడాది పొడవునా జలధార ప్రవహిస్తూ ఉంటుంది. మడుగులోని నీటిలో అడుగున ఉన్న మట్టి, రాళ్లు, చిన్న చిన్న చేపపిల్లలు సైతం స్పష్టంగా కనిపించడం ఇక్కడి మరో విశేషం. దీంతో ఈ కోనను అద్దాల కోనగా కూడా పిలుస్తుంటారు. దశాబ్దాల నాటి ఈ పెద్దతీర్థంకోన అటవీప్రాంతంలో ఓ మూలగా ఉండడంతో కాలక్రమంలో మూలకోనగా మారింది. అనునిత్యం మనస్సును ఆహ్లాదపరిచే ఈ ప్రకృతి అందాలను తిలకించేందుకు సెలవు రోజుల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడి తరలివస్తుంటారు.

కోర్కెలు తీర్చే సంగమేశ్వరస్వామి

మూలకోన కొండపై శ్రీపార్వతీ సమేత సంగమేశ్వర స్వామి కొలువై ఉండగా, కోనేరుకు ఎదురుగా శ్రీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి కొలువై ఉండడం ఇక్కడి మరో ప్రత్యేకత. జలపాతంలో స్నానమాచరించి, భక్తిప్రపత్తులతో సంగమేశ్వరస్వామిని పూజిస్తే కోరిన కోరికలు తప్పక తీరుతాయని ప్రతీతి. ఏటా మహాశివరాత్రి ఉత్సవాలకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివస్తుంటారు. మహాశివరాత్రి వేడుకల్లో కోనేరులో నిర్వహించే తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తుతారు. పెద్ద ఎత్తున అన్నదానం, పండరి భజనలు, వీధినాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

పౌర్ణమి రోజున ఆకాశ దీపం

ప్రతి పౌర్ణమి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, ఎత్తైన కొండపై ఆకాశదీపాన్ని వెలిగించడం ఇక్కడి మరో ప్రత్యేకత. ప్రతి సోమవారం ప్రత్యేక పూజా కైంకర్యాలతో పాటు నిత్య దీపారాధన జరుగుతుంది. ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి తిరుమలరెడ్డి, సహాయ కార్యదర్శి మనోహర్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

ఇలా చేరుకోవచ్చు

పుత్తూరు మండలం, నేసనూరు పంచాయతీ, కల్యాణ వేంకటేశ్వరపురం అటవీప్రాంతంలో మూలకోన ఉంది. పుత్తూరు నుంచి 6 కిలో మీటర్ల దూరంలోని గోపాలకృష్ణాపురం వరకు ప్రతిరోజూ బస్సు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి 2 కిలో మీటర్ల మేర మట్టి, గులక రాళ్ల రోడ్డు మీదుగా కల్యాణ వేంకటేశ్వర పురం గ్రామం చేరుకోవాలి. అక్కడి నుంచి మరో 2 కిలో మీటర్ల మేర గులకరాళ్ల దారి గుండానే కోనకు చేరుకోవచ్చు. కోన వరకు కార్లు, ట్రాక్టర్లు, బస్సులు వెళ్లేందుకు రోడ్డు అనువుగానే ఉంది.

విద్యుత్, రోడ్డు ఏర్పాటుకు కృషి



సహజసిద్ధ మూలకోన అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నాం ప్రస్తుతం కల్యాణ వేంకటేశ్వర పురం వరకే విద్యుత్ సౌకర్యం ఉంది. అక్కడి నుంచి కోనకు విద్యుత్ లైన్ ఏర్పాటు, గోపాలకృష్ణాపురం నుంచి తారురోడ్డు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కోనలోని సంగమేశ్వరస్వామి ఆలయ మెట్లను పునరుద్ధరించాలని నిర్ణయించాం. ఇలా అన్ని విధాల కోన అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషిచేస్తున్నారు.

– కె.భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు, మూలకోన అభివృద్ధి కమిటీ



ప్రకృతి అందాల నడుమ కోనకు దారి, కొండరాళ్ల మధ్య సెలయేరు, కోనేరు మండపంలో శివలింగం, కొండపై పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయం

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

రామచంద్రాపురం: వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరని ఎస్‌ఐ చిరంజీవి అన్నారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రధాన రహదారి వద్ద తిరుపతి, పచ్చికాపల్లం వైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపినా, వారికి వాహనాలు ఇచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



బండారుపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఏర్పేడు: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలన అందరి బాధ్యతని ప్రగతి సంస్థ మండల కన్వీనర్లు శిరీష, సుభాస్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం మండలంలోని బండారుపల్లె, పాయిల్‌సెంటర్ ఎస్టీ కాలనీల్లో ప్రపంచ బాలల హక్కుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుకబట్టీలు, దుకాణాలు, అగ్రకుల వర్గాల ఇళ్లలో చిన్నారులు బాలకార్మికులుగా పనులు చేస్తున్నట్లు ఆరోపించారు. ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. చదువుతోనే ప్రగతి సాధ్యమని తల్లిదండ్రులు గుర్తించాలని తెలిపారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని సూచించారు. 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రతినిధులు వెంకటేష్, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపుదాం

రేణిగుంట: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి బడి ఈడు పిల్లలను బడికి పంపుదామని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి అన్నారు. మండలంలోని వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరు క్రై సంస్థ సహకారంతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహిళలు, చిన్నారులతో కలసి ప్లకార్డులను ప్రదర్శిస్తూ చైతన్య ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రగతి సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ గంగమ్మ, ఆశావర్కర్ మునికుమారి పాల్గొన్నారు.

తొట్టంబేడు: బాలకార్మిక రహిత సమాజమే లక్ష్యమని ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ అన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లి ఎస్టీకాలనీలో సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు.

కల్యాణం.. కమనీయం

వాకాడు: దుగ్గరాజపట్నంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

ప్రమాణ స్వీకారోత్సవం ప్రత్యక్ష ప్రసారం



నారావారిపల్లి సీహెచ్‌సీలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న స్థానికులు

చంద్రగిరి/భాకరాపేట: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో బుధవారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకారోత్సవం ప్రత్యక్ష ప్రసారాలను ఏర్పాటు చేశారు. అమరావతిలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని చంద్రగిరి ఎంపీడీఓ కార్యాలయం, పనపాకంలో కమ్యూనిటీ హాలు, నారావారిపల్లిలో సీహెచ్‌సీ ఆస్పత్రిలో ప్రజలందరూ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు వచ్చిన ప్రజలకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు మండల అధికారులు తెలిపారు. అదేవిధంగా చిన్నగొట్టిగల్లు మండల కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అధికారులు, పొదుపు సంఘాల మహిళలు తిలకించారు.

15 నుంచి రైతు కూలీ సంఘం మహాసభలు



కరపత్రాల ఆవిష్కరణ

వెంకటగిరి రూరల్ : రైతాంగ సమస్యల పరిష్కార దిశగా ఏలూరులో 15, 16, 17వ తేదీల్లో రైతు కూలీ సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య తెలిపారు. ఆయన బుధవారం పల్లెవీధిలోని శ్రీకాళహస్తి శేషయ్య భవనం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం కార్యవర్గ సభ్యుడు గంగలపూడి కృష్ణారెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.